ఆణిముత్యాలకు నగదు ప్రోత్సాహకాలు


రుస్తుంబాద స్కూల్‌లో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న దృశ్యం


మొగల్తూరు హైస్కూల్లో విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న జెడ్పీటీసీ బాపూజీ


చింతపర్రు మంచినీటి చెరువు రేవు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ కనకలక్ష్మి


పోడూరులో విద్యార్థులకు మెడల్స్ అందిస్తున్న జెడ్పీఫ్లోర్ లీడర్ పెద్దిరాజు, ఎంపీపీ సుమంగళి సాగర్

- కార్పొరేట్ స్థాయిలో పాఠశాలల అభివృద్ధి
- ప్రభుత్వ విధానాలతో పెరిగిన అడ్మిషన్లు
- మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ

నరసాపురం: నాడు – నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక రుస్తుంబాద, టేలర్‌పేట, రాయిపేట లెనిన్ హైస్కూళ్లలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతిలో టాప్–3 స్థాయిలో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీవెంకట రమణ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకు అమ్మఒడి లాంటి పథకాలు అమలు చేస్తోన్న ముఖ్యమంత్రి మరోపక్క పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్స్ బాగా పెరిగాయని, దీనికి ప్రభుత్వం తీసుకున్న విధానాలే కారణమని చెప్పారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కామన నాగిని, కొత్తపల్లి నాని, కౌన్సిలర్ సఖినేటిపల్లి సురేష్ పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య

మొగల్తూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా పేద విద్యార్థులకు మన రాష్ట్రంలో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తోన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ అన్నారు. స్థానిక పెన్మత్స రంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన పిప్పళ్ల జీవన నాగశ్రీ, వేండ్ర కుమార్, పాలా యామినిలకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, పీసీ చైర్మన్ బర్రి వెంకన్న, ప్రధానోపాధ్యాయులు రవిశంకర్ సర్కార్, నాయకులు రేవు రాంబాబు, పడవల సత్యనారాయణ, కర్రి వీరాస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అభినందనీయం

పాలకొల్లు అర్బన్: పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వీరా దేవిశ్రీ ప్రవీణ్, వీరా షణ్ముఖ ఆనంద్, తాళ్ల శివ పార్వతి మల్లేశ్వరిలకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 ఎంపీపీ అందజేశారు. అనంతరం పంచాయతీ నిధులతో చేపట్టే మంచినీటి చెరువు నిర్మాణ పనులకు ఎంపీపీ కనకలక్ష్మి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మాపు పెద్దిరాజు, ఉపసర్పంచ్ పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ సులేమాన్, పీఎంసీ చైర్మన్ వి.వెంకటేశ్వరరావు, హెచ్ఎం సీహెచ్ రామారావు, సీఆర్పీ లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉన్నతే సీఎం జగన్ లక్ష్యం

పోడూరు: పేదవిద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు అన్నారు. పోడూరు కల్నల్ డీఎస్‌రాజు జెడ్పీహైస్కూల్లో సోమవారం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జెడ్పీఫ్లోర్‌లీడర్ పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు చేతులమీదుగా నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పెద్దిరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పట్నుంచీ ప్రభుత్వ పాఠశాలలు, హైస్కూళ్ల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ సుమంగళి సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, ఎంఈఓ ఐ.జనార్దనరాజు, దేవస్థానం చైర్మన్ పోడూరి సత్యసాయిబాబా, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్య బలోపేతం

పెనుగొండ: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. ఇలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన జగనన్న ఆణిముత్యాలు షేక్ మహ్మద్ ఉన్నీషా, గాలి దివ్య, యాండ్ర తేజశ్రీలకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000, ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్‌ను సర్పంచ్ దండు పద్మావతి, ఎంపీటీసీ పడపట్ల పద్మ నాగేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.రాంబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పెనుగొండ చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు బహుమతులను ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన, సర్పంచ్ నక్కా శ్యామలాసోని ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు భరణీ కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సాహించాలి

యలమంచిలి: ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సాహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంటుందని మేడపాడు సర్పంచ్ గంటా శాంతకుమారి అన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షల ఫలితాల్లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన మేడపాడు హైస్కూల్ విద్యార్థులకు నగదు పురస్కారం, మెడల్స్ సోమవారం ఆమె స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. కార్పొరేట్ స్కూల్స్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఆణిముత్యాలు అవార్డు అందుకున్న విద్యార్థులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ దేగల సూర్యప్రభ, ఉపసర్పంచ్ ముద్దల శ్రీనివాస్, నాయకులు దేగల వెంకటేశ్వరరావు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు

నరసాపురం రూరల్: విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. సోమవారం మండలంలోని సీతారాంపురం సౌత్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు మచ్చెట్టి పుష్పాంజలి, పట్నాల సాయిసిరి, మైలాబత్తు జెస్సికలను అభినందించారు. ప్రోత్సాహకాలు, మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు వీరన్న సూచించారు. గ్రామ సర్పంచ్ దొండపాటి వెంకట్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పులఖండం శ్రీనివాస్, వాస్కూరి నర్సింహస్వామి, ఉపాధ్యాయులు లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీచర్ల ఉన్నతపాఠశాలలో మొదటి మూడు శ్రేణుల్లో నిలచిన విద్యార్థులు కట్టా హేమ నరేంద్ర, గుబ్బల జయప్రకాష్, జుత్తిక సాహితిలను ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ అన్నారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన మెడల్స్, ప్రోత్సాహకాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కడలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎల్బీచర్ల ఉన్నతపాఠశాలలో ఆణిముత్యాల అవార్డులు అందిస్తున్న జెడ్పీటీసీ తదితరులు


ఇలపర్రులో విద్యార్థులకు పతకాలు అందించిన సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు పద్మావతి


పెనుగొండలో జగనన్న ఆణిముత్యాలతో ఎంపీపీ పెద్ద, జెడ్పీటీసీ గోవర్ధన, సర్పంచ్ సోని



మేడపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేసిన గ్రామ పెద్దలు

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

మొగల్తూరు: ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. ఎంపీడీఓ వొండ్రు బాబ్జి రాజు ఆదేశాల మేరకు సోమవారం మొగల్తూరు రెండో సచివాలయం పరిధిలో పని చేస్తోన్న ఉపాధి హామీ కూలీలకు పంపిణీ చేశారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శి సీహెచ్ చాందినీ ప్రియ, ఏఎన్ఎం స్వరూపరాణి పాల్గొన్నారు.

అలరించిన శ్రీనివాస కల్యాణం

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మవారి జాతర సందర్భంగా ఖండవిల్లి నిత్యప్రియ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణ ప్రదర్శన అలరించింది. కుమారి నరుకుల సాయి ప్రియ సిస్టర్స్ నాట్య విన్యాసం ఆకట్టుకొంది.

ఘనంగా కొండాలమ్మ జాతర

పెనుమంత్ర: బ్రాహ్మణచెర్వులో కొండాలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం ఆలయ వ్యవస్థాపకులు యాతం వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శెట్టిబలిజ సేవా సంఘం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

సంక్షేమం రూ.1450 కోట్లు.. అభివృద్ధి రూ.4000 కోట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఛీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

- నాలుగేళ్లలో అవినీతి రహిత పాలన
- ప్రభుత్వ ఛీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గంలో నాలుగేళ్లలో సంక్షేమ కార్యక్రమాల ద్వారా రూ.1450 కోట్లు ప్రజలకు ఖర్చుపెట్టామని, రూ.4000 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ప్రభుత్వ ఛీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు వివరించారు. సోమవారం సాయంత్రం ముదునూరి తన కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నరసాపురం, మొగల్తూరు మండలాల గ్రామ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పురోగతిని ముదునూరి వివరించారు. ప్రజల అభిమతానికి అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని చెప్పారు. నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపించారన్నారు. ఆక్వా యూనివర్సిటీ, బియ్యపుతిప్ప ఫిషింగ్‌హర్బర్ వంటి ప్రాజెక్ట్‌లకు రూ.వేల కోట్లు నిధులు ఇచ్చారని చెప్పారు. వశిష్ట వంతెన లాంటి దీర్ఘకాల పనులను ముందుకు కదలకుండా ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లలో ఇంత భారీ స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం ఓ చరిత్ర అన్నారు.

గడపగడప పనులు 90 శాతం పూర్తి

నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.13.80 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు 90 శాతం పూర్తయ్యాయని ముదునూరి చెప్పారు. కుల, మత, పార్టీలకు అతీతంగా నియోజవకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సాగుతున్నామని వివరించారు. సీఎం జగన్ నాలుగేళ్ల అభివృద్ధి, సంక్షేమ పాలన ప్రతిపక్షాలకు చెంపపెట్టని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ కేంద్రపాలక మండలి సభ్యుడు పీడీ రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, బర్రి శంకరం, అందే భుజంగరావు, చాగంటి సత్యనారాయణ, పార్టీ పట్టణ, మండల, మొగల్తూరు మండలాల అధ్యక్షులు బూసరపు జయ, దొంగ మురళీకృష్ణ, కర్రి ఏసుబాబు, డీసీసీబీ డైరెక్టర్ ఇంజేటి జాన్‌కెనడి, నరసాపురం సొసైటీ అధ్యక్షుడు షేక్ బుఠిమస్తాన్, కామన బుజ్జి, కావలి నాని, తిరుమాని నాగరాజు, కడలి రాంబాబు, పడవల సత్యనారాయణ, పప్పుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

నరసాపురం రూరల్: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జూలై 1 నుంచి జూలై 31 వరకు నెల రోజులపాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని చేపడుతోందని తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ పథకంపై వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్లు బెజవాడ సీతారత్నం, జ్యోతి, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్‌లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కుదిరిన వేతన ఒప్పందం

పెనుగొండ: పెనుగొండ ఏరియా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్‌కు, రైస్ మిల్లర్లు, కార్మికులకు మధ్య నూతన వేతన ఒప్పందం జరిగిందని పెనుగొండ ఏరియా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోనాల భీమారావు తెలిపారు. సోమవారం పెనుగొండలో రెండేళ్ల కాలపరిమితికి, ఏడు గంటల పనిదినం ప్రాతిపదికన నూతన వేతన ఒప్పందం కుదిరందని వివరించారు. రైస్ మిల్ యూనియన్ తరపున ఎస్ సుబ్రహ్మణ్యం, వెలగల ఉదయ భాస్కరరెడ్డి, కేఎస్ఎన్‌పి రెడ్డి, టి.శ్రీనివాసు, నాగళ్ల ప్రసాద్, సూర్యనారాయణ, వర్కర్స్ యూనియన్ తరపున కోనాల భీమారావు, సిద్దాబత్తుల పరబ్రహ్మం, పెచ్చెట్టి శ్రీను, కె.రామలింగం, మాణిక్యాలరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శ్రీనివాస్ పరామర్శలు


వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

యలమంచిలి: మండలంలోని వడ్డిలంక, లక్ష్మీపాలెం గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. వడ్డిలంకలో పోతుమూడి వెంకటరమణ, శిరిగినీడి ముసలయ్య లక్ష్మీపాలెం గ్రామంలో మారెడ్డి సత్యనారాయణ, పొన్నమండ ధనమ్మ మరణించారు. వారందరి ఇళ్లకు శ్రీనివాస్ వెళ్లి ఆయా కుటుంబాల సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట లక్ష్మీపాలెం సర్పంచ్ గటిగంటి మహేష్ నారినమెరక ఎంపీటీసీ సభ్యుడు ఇనుకపల్లి శ్రీధర్‌వర్మ, పార్టీ నాయకులు ఆరుమిల్లి లక్ష్మణరావు, శీలం రామారావు, బొక్కా సూరిబాబు, మోకా ప్రేమ్‌చంద్, లంకే సూర్యచంద్రం, మల్లాడి ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

యువతి ఫిర్యాదుతో నలుగురిపై కేసు

నరసాపురం: స్థానిక 30వ వార్డుకు చెందిన ఓ యువతి ఫిర్యాదుతో పోలీసులు నలుగురిపై సోమవారం కేసు నమోదు చేశారు. టౌన్ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం. యువతి ఇంటికి సమీపంలో పనుల నిమిత్తం తరచూ వచ్చే శ్యామ్‌బాబు ఆమెను ప్రేమిస్తున్నానంటూ నమ్మించాడు. పార్కులు, బీచ్‌లు, లాడ్జిలు తిప్పాడు. ఆమె గర్భం దాల్చడంతో ఏవో ట్యాబెట్లు పట్టుకొచ్చి అబార్షన్ చేశాడు. పెళ్లి చేసుకోమంటే మొఖం చాటేశాడు. ఈ నేపథ్యంలో గత నెల 24న బాధితురాలు పసలదీవి గ్రామానికి శ్యామ్‌బాబును నిలదీయడానికి వెళ్లింది. అక్కడ శ్యామ్‌బాబుకు దగ్గర బంధువులైన గుంపుల మంగతాయారు, గుంపుల నాగేశ్వరరావు, ఉల్లూరి శ్రీనులు బాధితురాలిపై దాడికి గిగారు. యువతి ఫిర్యాదుతో పోలీసులు శ్యామ్‌బాబు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

'డీఎన్నార్'లో అడ్మిషన్లు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ శోభారాణి సోమవారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో మహిళా డిగ్రీ కళాశాల డీఎన్నార్ కళాశాల ఒక్కటేనని అన్నారు. నూతన విద్యావిధానాన్ని అనుసరించి నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు సింగిల్ మేజర్ విధానంలో భోదిస్తామని చెప్పారు. బీఏ ఎకనామిక్స్, బీఎస్సీ కంప్యూటర్స్, మ్యాథ్స్, జువాలజీ, బీకామ్ కంప్యూటర్స్ కోర్సులు ఉంటాయని, మిగిలిన గ్రూప్ సబ్జెక్టులు మైనర్‌గా ఉంటాయని వివరించారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 63021 94657లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

మొగల్తూరులో ఫ్యామిలీ డాక్టర్

మొగల్తూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లీనా సుప్రియ కోరారు. సోమవారం మొగల్తూరు 4వ సచివాలయ పరిధిలోని వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన సుమారు 70 మంది రోగులను పరీక్షించారు. గ్రామంలో లేవలేని పరిస్థితిలో ఉన్న రోగులు ఇంటికి వెళ్లి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది విరాజిత, ఎంవీ శాంతకుమారి, ప్రభాకర్, మధుసూదనరావు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అరట్లకట్టలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పాలకొల్లు అర్బన్: కుట్టు శిక్షణ పొందడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు మెరుగైన ఉపాధి లభిస్తుందని రిటైర్డు టీచర్ పెన్మెత్స వెంకట్రాజు అన్నారు. పాలకొల్లు మండలం అరట్లకట్టలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 36 మంది మహిళలకు రెండు నెలల కుట్టు శిక్షణా కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోఆర్డినేటర్ రామకృష్ణ, క్లస్టర్ కోఆర్డినేటర్ రామాంజనేయరాజు, డీఆర్‌డీఏ సీసీ పద్మావతి పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మార్క్స్‌కు 351వ ర్యాంకు


ఉత్తమ ర్యాంకు సాధించిన మార్క్స్‌ను అభినందిస్తున్న రాఘవరెడ్డి

నరసాపురం: ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023 ఆల్ ఇండియా ఫలితాల్లో నరసాపురం ఆదిత్య కళాశాల విద్యార్థి చిలకపాటి జెబ్రియల్ మార్క్స్ 351వ ర్యాంకు సాధించారని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్వీ రాఘవరెడ్డి చెప్పారు. దేశంలోని ప్రముఖ ఐఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో మార్క్స్ ప్రవేశం పొందే అవకాశం ఉందన్నారు. మార్క్స్‌ను రాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

పండితవిల్లూరు వీఏఎస్‌గా మాధురి


శ్రీరంగనాథరాజుకు బొకే ఇస్తున్న మాధురి

పోడూరు: పండితవిల్లూరు పశువైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా డి.మాధురి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పాడిరైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు మంచి వైద్యసేవలు అందించాలని మాధురికి శ్రీరంగనాథరాజు సూచించారు. మాధురి యలమంచిలి పశువైద్యశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పండితవిల్లూరులో జిన్నూరు వెటర్నరీ డాక్టర్ ఎస్.మహేష్‌కుమార్ ఇన్‌చార్జిగా పనిచేశారు.

పాలకొల్లు లయన్స్‌కు అవార్డు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ లయన్స్ క్లబ్‌కు జిల్లా టాప్ స్టార్ అవార్డు దక్కింది. ఆదివారం నిడదవోలులో లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాలులో జిల్లా లయన్స్ క్లబ్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాలకొల్లు లయన్స్ క్లబ్‌కు టాప్ స్టార్ అవార్డు, క్లబ్ అధ్యక్షుడు ముచ్చర్ల సత్యనారాయణకు బెస్ట్ ప్రెసిడెంట్, నందుల రమణికి బెస్ట్ క్వెస్ట్ యాక్టివిటీస్ అవార్డు, నిమ్మల పాపారావు నాయుడుకు లయన్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో పాటు మొత్తం 22 అవార్డులు అందుకున్నట్టు క్లబ్ అధ్యక్షులు ముచ్చర్ల సత్యనారాయణ తెలిపారు. అవార్డులు అందుకున్న సభ్యులందరికీ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి అభినందనలు తెలిపారు. సమాజానికి మరిన్ని ఉత్తమ సేవలందించాలని కోరారు.

యలమంచిలి ఎంఈఓ-2గా కనుమూరి

యలమంచిలి: యలమంచిలి ఎంఈఓ–2గా కనుమూరి వెంకట రామకృష్ణంరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరవాసరం మండలం దూసనపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న ఆయన ఇటీవల ఏలూరులో జరిగిన ఎంఈఓ కౌన్సిలింగ్‌లో ఉత్తర్వులు పొందారు. రామకృష్ణంరాజును యూటీఎఫ్ నాయకులు పోలిశెట్టి క్రాంతికుమార్, ఈద దైవ వరప్రసాద్, పంతం రామ్మూర్తినాయుడు, దండు పద్మావతి, గుత్తిందీవి శ్రీనివాస్, పెన్మెత్స బుద్ధరాజు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

పెనుగొండ: ములపర్రు పంచాయతీలో మూడేళ్లుగా ట్యాంకు వాచర్లకు వేతనాలు చెల్లించకుండా, పంచాయతీకి వచ్చిన ఆదాయాన్ని జమచేయకుండా దుర్వినియోగానికి పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు మాదాసు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు ఎస్ గురుమూర్తి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ వెంకటేశ్వరరావు, కార్మికులు జి.నాగార్జున, యాండ్ర రాంబాబు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు పురస్కారాలు

పాలకొల్లు అర్బన్: స్థానిక 31వ వార్డులో పనిచేస్తోన్న వలంటీర్లకు లయన్స్ కమ్యూనిటీ హాలులో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు పురస్కారాలు అందించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ చేతుల మీదుగా వలంటీర్లకు వజ్ర, రత్న, సేవా పురస్కారాలు అందించనున్నట్టు పేర్కొన్నారు. వార్డు ఇన్‌చార్జీలు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

22న పాలకొల్లుకు కేంద్ర సహాయ మంత్రి రాక

పాలకొల్లు సెంట్రల్: ప్రధాని మోదీ పాలనలో అభివృద్ధిపై ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక సంత మార్కెట్ రోడ్డుని శ్రీనివాసా డీలక్స్ పక్కన మహజన్ సంపర్క్ అభియాన్ సమావేశం నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారిన తాతాజీ సోమవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ హాజరవుతారని చెప్పారు. అనంతరం టిడ్కో గృహ పథకాలపై వివరాలు అడిగి తెలుసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవికుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గుడాల ఈశ్వర్ చంద్, యర్రంశెట్టి పద్మారావు, దొంగ కుమార్, జక్కంపూడి కుమార్, గూడపాటి బాబి, బోడా కనకరాజు తదితరులు పాల్గొన్నారు.